PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 338 పేజీలు - 08 ఆదివారం 01 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

భారత వైమానిక దళ నూతన చీఫ్‌గా

అశుతోష్ దీక్షిత్

● నాలుగు దశాబ్దాల సైనిక అనుభవం.. 3,500 గంటలకు పైగా విమాన ప్రయాణం

భారత నావిగేషన్ వ్యవస్థకు కొత్త బలం..

ఇస్రో మరో చారిత్రాత్మక విజయం!

- ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం..

జీపీఎస్‌కు స్వదేశీ ప్రత్యామ్నాయమైన నావిక్ వ్యవస్థకు మరింత సామర్థ్యం

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్ష రంగంలో మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. దేశీయ ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థ 'నావిక్'ను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా అక్టోబర్ 30న రాత్రి ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టినట్లు ఇస్రో ప్రకటించింది. **స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యం** ఎన్‌వీఎస్-03 ఉపగ్రహంలో భారత శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ అణు గడియారాన్ని అమర్చడం ఈ ప్రయోగంలో ప్రత్యేకత. దీనివల్ల అత్యంత కచ్చితమైన సమయ నిర్ధారణ, స్థాన గుర్తింపు మిగతా2లో...

హైదరాబాద్ నీటి కష్టాలకు చెక్..

నేటి నుంచే గ్రీన్ ట్యాంకర్ల సేవలు!

తాగునీటిని పొదుపు చేయడమే లక్ష్యం.. ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీరు వినియోగించాలి: సీఎస్ సంజయ్ జాజు

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: హైదరాబాద్‌లో తాగునీటి వనరుల పరిరక్షణతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నవంబర్ 1 నుంచి గ్రీన్ ట్యాంకర్ల సేవలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రకటించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో నగర తాగునీటి సరఫరా పరిస్థితిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీరు అవసరం లేని పనులకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించాలని సీఎస్ సూచించారు. నిర్మాణ పనులు, మొక్కలకు నీరు పోయడం, రోడ్లు, పరిసరాల శుభ్రత వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటిని ఉపయోగించాలని మిగతా2లో...

పంజాబ్ ఎన్నికలకు ఆప్ తొలి జాబితా విడుదల

ధురి నుంచి సీఎం భగవంత్ మాన్ పోటీ.. 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ అవకాశం

తుమ్మిడిహెట్టి బ్యారేజీకి కొత్త రూపురేఖలు..

ముంపు తగ్గించి నీటి వినియోగం పెంచడంపై దృష్టి!

మహారాష్ట్ర అభ్యంతరాలకు సాంకేతిక పరిష్కారాలు చూపాలి.. సాగునీటి లక్ష్యానికి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలి: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్రలో తలెత్తుతున్న ముంపు, పర్యావరణ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సాగునీటి లక్ష్యాలకు ఎలాంటి విఘాతం కలగకుండా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించేలా సాంకేతిక మార్పులను పరిశీలించాలని సూచించారు. శనివారం సచివాలయంలో బ్యారేజీ అలైన్‌మెంట్లు, సాంకేతిక అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే నదీ పరివాహక ప్రాంతాలు, అటవీ భూములు, పర్యావరణ సున్నిత ప్రాంతాలు, రక్షిత ప్రాంతాలు, రెవెన్యూ భూములు, జనావాసాలను మిగతా2లో...

జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి

● ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో బహిరంగ అభిశంసన.. సీఈసీపై ఆరు అభియోగాలు చదివిన ఖర్గే ● 2024 ఎన్నికల్లో అక్రమాలు.. 13.2 కోట్ల మంది ఓటర్ల తొలగింపు ఆరోపణలు ● ఓటు హక్కును హరించిన వారిని వదిలిపెట్టం: రాహుల్‌గాంధీ

అబద్ధాల్లో రేవంత్‌కు ఆస్కార్

● మంచిరేవులలో రూ.2 వేల కోట్ల కుంభకోణం.. మియాపూర్ భూముల విక్రయానికి కలెక్టర్‌పై ఒత్తిడి ● హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలు తాకట్టు పెట్టారని ఆరోపణ ● రూ.10 వేల కోట్ల రుణం కోసం రూ.400 కోట్ల కమీషన్ చెల్లించారని విమర్శ ● సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్



తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: అబద్ధాలు చెప్పడంలో ఆస్కార్ అవార్డు ఉంటే అది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. తాము చేసిన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం క్రెడిట్ కొట్టేస్తోందని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న భూ వ్యవహారాలపై పలు మిగతా2లో...

యాదాద్రీశుడి సన్నిధిలో గవర్నర్ దంపతులు.. ప్రత్యేక పూజలు!

యాదగిరిగుట్టలో తెలంగాణ వేద విద్వన్మహాసభలకు హాజరు.. వేద విద్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపు.. 2027 ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తెలంగాణ

తుక్కుగూడలో రూ.200 కోట్లతో మివి పరిశ్రమ!

2,500 మందికి ఉపాధి కల్పించేలా అత్యాధునిక తయారీ కేంద్రం.. ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి విచారణ జరపాలని రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలోని ఖర్గే నివాసంలో బహిరంగ అభిశంసన కార్యక్రమం నిర్వహించారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఈసీపై ఆరు అభియోగాలను ఖర్గే చదివి వినిపించారు. ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడం, ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచడం వంటి అంశాలను అభియోగాలుగా పేర్కొన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకు జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘాన్ని నడుపుతున్నారని ఖర్గే ఆరోపించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని విమర్శించారు. ప్రజల ఓటు హక్కును హరించి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మంది పేర్ల తొలగింపుపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితర ఇండియా బ్లాక్ నేతలు పాల్గొన్నారు. అనంతరం అభిశంసన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

యాదాద్రీశుడి సన్నిధిలో గవర్నర్ దంపతులు.. ప్రత్యేక పూజలు!

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు.

వేద విద్వన్మహాసభలకు హాజరు శ్రీ జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్న తెలంగాణ వేద విద్వన్మహాసభలకు గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేద విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రాచీన వేద విజ్ఞానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేదాలు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి పరిరక్షణ, నైతిక విలువలు, జీవన విధానంపై ఎంతో జ్ఞానాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

2027 ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ ఈ సందర్భంగా యాదాద్రి దేవస్థానం రూపొందించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని గవర్నర్ సూచించారు.

భారత నావిగేషన్ వ్యవస్థకు కొత్త బలం..

(మొదటి పేజీ తరువాయి)

సేవలకు మరింత అవకాశం కలగనుంది. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్ బ్యాండ్లకు అదనంగా ఎల్1 సిగ్నల్‌ను కూడా ఇందులో ప్రవేశపెట్టారు. దీంతో ఆధునిక మొబైల్ పరికరాలు, ఇతర నావిగేషన్ వ్యవస్థలకు అనుసంధాన సామర్థ్యం పెరగనుంది.

1,500 కిలోమీటర్ల పరిధిలో సేవలు భారత భూభాగంతో పాటు దేశ సరిహద్దుల చుట్టూ సుమారు 1,500 కిలోమీటర్ల పరిధిలో నావిక్ వ్యవస్థ ద్వారా స్థాన నిర్ధారణ, దిశానిర్దేశం, సమయ సేవలు అందించేందుకు వీలుంటుంది. రైళ్ల రాకపోకల పర్యవేక్షణ, వాహనాల ట్రాకింగ్, నౌకాయానం, వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, రక్షణ రంగాల్లో ఈ వ్యవస్థ కీలకంగా ఉపయోగపడనుంది.

నావిక్ వ్యవస్థకు పునరుత్తేజం నావిక్ వ్యవస్థలో కనీస కార్యాచరణకు అవసరమైన నాలుగు ఉపగ్రహాల సంఖ్యను ఈ ప్రయోగం ద్వారా పునరుద్ధరించినట్లు ఇస్రో ఛైర్మన్ తెలిపారు. ఉపగ్రహాన్ని తుది కక్ష్యలోకి చేర్చేందుకు తదుపరి దశల కక్ష్య మార్పులు కొనసాగనున్నాయి. ఈ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లను అభినందించారు. స్వదేశీ అంతరిక్ష సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ఈ ప్రయోగం మరో కీలక ముందడుగుగా నిలిచింది.

హైదరాబాద్ నీటి కష్టాలకు చెక్..

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి సరఫరా చేసే నీటి నాణ్యతను అధికారులు నిరంతరం పరిశీలించాలని స్పష్టం చేశారు.

ప్రత్యేక యాప్ ద్వారా గ్రీన్ ట్యాంకర్ల బుకింగ్ గ్రీన్ ట్యాంకర్ల ద్వారా అవసరానికి అనుగుణంగా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. దీనిద్వారా ప్రజలు సులభంగా ట్యాంకర్లను బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. సరఫరా చేసిన శుద్ధి నీటి పరిమాణంపై హైదరాబాద్ జలమండలి ఎండీ రోజువారీ నివేదిక సమర్పించాలని సీఎస్ ఆదేశించారు.

నవంబర్ 15 నాటికి అదనపు నీటి పథకం మిషన్ భగీరథ కింద అదనంగా రోజుకు 40 మిలియన్ గ్యాలన్ల నీటిని అందించే పథకాన్ని నవంబర్ 15 నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విలీనమైన పట్టణ స్థానిక సంస్థలకు వచ్చే ఏడాది ఆగస్టు వరకు బల్క్ వాటర్ సరఫరా కొనసాగించాలని తెలిపారు.

నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న 'సేవ్ వాటర్' ప్రచారం ద్వారా వ్యక్తులు, సంస్థలు, పరిశ్రమల్లో నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంజయ్ జాజు వెల్లడించారు. తాగునీటి వనరులను కాపాడుకుంటూ నగర ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

అబద్ధాల్లో రేవంత్‌కు ఆస్కార్

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు చేశారు.

మంచిరేవులలో రూ.2 వేల కోట్ల కుంభకోణం మంచిరేవుల గ్రేహౌండ్స్ భూముల కేసులో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోయిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. 2017లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో న్యాయపోరాటం చేసి, 2021లో హైకోర్టు డివిజన్ బెంచ్‌లో విజయం సాధించామని తెలిపారు. 2023 ఆగస్టు 1న సుప్రీంకోర్టు 142 ఎకరాలు ప్రభుత్వానివేనని తుది తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ఎకరం రూ.100 కోట్లు పలికే ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. మంచిరేవులలో మొత్తం రూ.2 వేల కోట్ల కుంభకోణం జరిగిందని విమర్శించారు.

మియాపూర్ భూములపై ఒత్తిడి మియాపూర్ భూములపై కోర్టు తీర్పు ప్రతులు చేతికి రాకముందే వాటిని విక్రయించాలంటూ కలెక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ భూముల విషయంలో ఎవరెవరి నుంచి ముందస్తు చెల్లింపులు తీసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. గోల్డ్‌స్టోన్ ప్రసాద్ సోదరుడిని జైలుకు పంపింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై అప్పట్లో చర్యలు తీసుకున్నామని వివరించారు.

హెచ్‌సీయూ భూములు తాకట్టు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో తాకట్టు పెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. రూ.10 వేల కోట్ల రుణం కోసం ముంబైకి చెందిన బ్రోకర్‌కు రూ.400 కోట్ల కమీషన్ ఇచ్చారని విమర్శించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు

నెహ్రూకు ప్రధాని పీఠం.. పటేల్‌కు అన్యాయం!

- కాంగ్రెస్‌పై కిషన్‌రెడ్డి ధ్వజం
- దేశ తొలి ప్రధాని ఎంపికలోనే ఓటు చోరీ జరిగిందని ఆరోపణ.. పటేల్ సేవలను స్మరించుకుంటూ కాంగ్రెస్ రాజకీయాలపై విమర్శలు

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: దేశ స్వాతంత్ర్యానంతరం ప్రధాని ఎంపిక సమయంలోనే ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించారని కేంద్ర మంత్రి, బీజేపీ నేత జి. కిషన్‌రెడ్డి కాంగ్రెస్‌పై ఆరోపణలు గుప్పించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు లభించాల్సిన ప్రధానమంత్రి పదవిని జవహర్‌లాల్ నెహ్రూకు కట్టబెట్టారని, ఇదే దేశంలో తొలి ఓటు చోరీ అని వ్యాఖ్యానించారు. పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించిన కిషన్‌రెడ్డి.. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో పటేల్ పోషించిన పాత్రను కొనియాడారు. ఆపరేషన్ పోలో ద్వారా నిజాం పాలనకు ముగింపు పలకడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. దేశ ఐక్యత కోసం పటేల్ చేసిన సేవలను యువత గుర్తించాలని పిలుపునిచ్చారు.

భారత వైమానిక దళ నూతన చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన చీఫ్‌గా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. గతంలో వైమానిక దళ వైస్ చీఫ్‌గా, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు నిర్వహించారు. దాదాపు నాలుగు దశాబ్దాల సైనిక అనుభవం కలిగిన దీక్షిత్ ఫైటర్, టెస్ట్ పైలట్‌గా వివిధ రకాల విమానాల్లో 3,500 గంటలకు పైగా ప్రయాణించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, కోప్ ఇండియా, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక సైనిక కార్యకలాపాలు, విన్యాసాల్లో పాల్గొన్నారు. వైమానిక దళ కార్యకలాపాలు, వ్యూహాత్మక ప్రణాళికలు, ఆధునికీకరణ రంగాల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది.

పంజాబ్ ఎన్నికలకు ఆప్ తొలి జాబితా విడుదల

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31:
2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తొలి జాబితాలో 40 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ధురి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. మంత్రి సంజీవ్ అరోరాకు లూథియానా వెస్ట్ టికెట్ కేటాయించింది. అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్‌కు కోట్కాపురా నుంచి అవకాశం కల్పించింది. జాబితాలో 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరోసారి టికెట్లు కేటాయించడం విశేషం.

ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తెలంగాణ

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: తెలంగాణ పారిశ్రామిక రంగంలో మరో భారీ పెట్టుబడి అడుగుపెట్టింది. ప్రముఖ స్వదేశీ ఎలక్ట్రానిక్స్ సంస్థ మివి రూ.200 కోట్ల వ్యయంతో రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ పరిశ్రమను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఇయర్‌బడ్స్, హెడ్‌ఫోన్స్, స్పీకర్లు, సౌండ్‌బార్లు తదితర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను తయారు చేయనున్నారు. నెలకు ఐదు లక్షల ఇయర్‌బడ్స్, 75 వేల సౌండ్‌బార్ల తయారీ సామర్థ్యంతో పరిశ్రమను రూపొందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2,500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో తయారీ రంగం 7.7 శాతం వృద్ధి సాధించడం పారిశ్రామిక పురోగతికి నిదర్శనమని వివరించారు.

ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తం..

- తాగునీటి కోసం రూ.120 కోట్ల నిధులు!
- సింగూరు ఆధారిత జిల్లాలకు ప్రత్యేక కేటాయింపులు.. ఇతర జిల్లాలకు రూ.కోటి చొప్పున మంజూరు

తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 31: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం సింగూరు ప్రాజెక్టు పరిధిలోని జిల్లాలకు రూ.120 కోట్లు మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క వెల్లడించారు. శనివారం హైదరాబాద్ నుంచి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ఇంజినీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం రూ.కోటి చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి బోరుబావులను అద్దెకు తీసుకుని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, బావులు, స్థానిక నీటి వనరులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

రెండు రోజుల్లో ఇంకుడు గుంతల పనులు పూర్తి ఇటీవల కురిసిన వర్షపు నీటిని భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. తాగునీటి వనరుల సమీపంలో ఇంకుడు గుంతలు, మ్యాజిక్ సోక్ పిట్‌ల నిర్మాణాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి పొదుపు ప్రాధాన్యంపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీతక్క స్పష్టం చేశారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీకి కొత్త రూపురేఖలు..

(మొదటి పేజీ తరువాయి)

గుర్తిస్తూ సమగ్ర పటాలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. వివిధ నీటిమట్టాల వద్ద ఎంత మేరకు భూమి ముంపునకు గురవుతుందో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని ఆదేశించారు. మహారాష్ట్ర అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఇంజినీరింగ్ మార్పుల ద్వారా సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

152 మీటర్ల ఎత్తుకు తెలంగాణ ప్రతిపాదన ప్రస్తుతం తుమ్మిడిహెట్టి బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టాన్ని 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. 152 మీటర్ల ఎత్తుతో నీటి నిల్వ సామర్థ్యం 5.697 టీఎంసీలకు పెరుగుతుందని, 148 మీటర్ల వద్ద ఇది 2.182 టీఎంసీలుగా ఉంటుందని అధికారులు వివరించారు. ఈ బ్యారేజీ ద్వారా 77 టీఎంసీల నీటిని మళ్లించేలా ప్రణాళిక రూపొందించారు.

5.85 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం తుమ్మిడిహెట్టి బ్యారేజీ, సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల అనుసంధానంతో ఏడు జిల్లాల్లో 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముంపు, పునరావాస సమస్యలను పరిష్కరిస్తూనే ప్రాజెక్టు సాగునీటి ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. మహారాష్ట్రతో ఇటీవల జరిగిన చర్చల నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య సమన్వయంతో ముందుకు వెళ్లేందుకు అవసరమైన సాంకేతిక వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

సేవా గుణమే నిజమైన సంపద.. వృద్ధుల ఆనందమే జన్మదిన కానుక!

పెద్దకొండూరు వృద్ధాశ్రమంలో ఆసరా ఫౌండేషన్ అధ్యక్షుడు బొల్ల శివశంకర్ 49వ జన్మదిన వేడుకలు

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తానని హామీ.. స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం

తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 31: జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమంగా నిర్వహిస్తూ ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నారాయణపురం మాజీ జడ్పీటీసీ బొల్ల శివశంకర్ తన 49వ జన్మదినాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్దకొండూరులోని శ్రీ యాదాద్రి సేవాశ్రమంలో వృద్ధుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బొల్ల శివశంకర్ మాట్లాడుతూ వృద్ధుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారికి ప్రేమ, ఆప్యాయత, ఆదరణ ఎంతో అవసరమని, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఆశ్రమంలోని వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తానని, ఆశ్రమానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వృద్ధులకు స్వయంగా భోజనం వడ్డించడంతో పాటు వారితో కలిసి భోజనం చేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దకొండూరు గ్రామ సర్పంచ్ గుండుబోయిన శిరీష ఇస్తారి యాదవ్, ఆసరా ఫౌండేషన్ చౌటుప్పల్ సభ్యులు పాల్గొన్నారు.

భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ ఘనంగా 42వ వర్ధంతి

• వలిగొండలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ గౌడ్

తొలి అక్షరం/వలిగొండ, అక్టోబర్ 31: కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు భారతదేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానిగా సేవలందించారు 16 సంవత్సరాలు భారతదేశానికి ప్రధానిగా చేశారు శ్రీమతి ఇందిరాగాంధీ పరిపాలనలో 14 బ్యాంకుల జాతీయకరణ గరీబ్ హటావో నినాదంతో దేశంలో పేదరిక నిర్మూలనకు ఎంతగానో కృషి చేసినారు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్ డిసిసి కార్యదర్శి కుర్షిత్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైసూర్ల ప్రవీణ్ పిఎసిఎస్ డైరెక్టర్ ఎమ్మ మల్లేశం పాలకూర వెంకటేశం కాసుల వెంకటేశం కొండూరు సాయి చిలుకూరు సత్తిరెడ్డి రాచమల్ల తిరుపతి దండ మల్లికార్జున ఎదురుగట్ల బాల నరసింహ జనగాం దశరథ కీర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు

- విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్

తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 31: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 42వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్రబోయిన శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ హాజరై ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ దేశ ఐక్యత, సమగ్రత కోసం కృషి చేశారని, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ప్రధానిగా ఉన్న సమయంలో బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తుచేశారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా 'గరీబీ హటావో' నినాదంతో పలు కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. దేశ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అణుశక్తి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారని అన్నారు. ఆమె జీవితం, సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ ఆమెను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి బిక్షపతి, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ సింగం శ్రావణి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముద్రబోయిన శ్రీకాంత్, డీసీసీ సభ్యుడు నేతుల సారంగపాణి యాదవ్, వార్డు సభ్యులు, మార్కెట్, సహకార సంఘాల డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

- జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే 143 నాయకులు

తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 31: గూడూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన గిరిజన వర్కింగ్ జర్నలిస్ట్, జనంసాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్, టీయూడబ్ల్యూజే 143 గూడూరు మండల ప్రధాన కార్యదర్శి బానోతు రామన్న నాయక్‌పై జరిగిన హత్యాయత్నాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే 143) మహబూబాబాద్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన నిందితులను తక్షణమే గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం జిల్లా ఎస్పీ శబరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కో-కన్వీనర్ గాడిపెల్లి శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ చందు నాయక్ మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యలు, ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల పక్షాన పనిచేస్తున్న రామన్న నాయక్‌పై కొందరు కక్షగట్టి పక్కా ప్రణాళికతో హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆరోపించారు. నంబర్ ప్లేట్ లేని కారులో వచ్చిన ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు ముందుగా రెక్కీ నిర్వహించి, రామన్న నాయక్ బైక్‌పై వెళ్తుండగా మామిడి తోట సమీపంలో కారుతో వెంబడించి అడ్డగించారని తెలిపారు. అనంతరం బీరు సీసాలు, ఇనుప రాడ్లు, కత్తులతో దాడికి పాల్పడినట్లు వివరించారు. ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను వెంటనే అరెస్టు చేయాలని నాయకులు కోరారు. దాడి వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులను గుర్తించి సమగ్ర విచారణ జరపాలని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం నిందితులపై రౌడీషీట్లు తెరవాలని, బాధిత జర్నలిస్ట్ రామన్న నాయక్‌కు తగిన పోలీసు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఎస్పీని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టి.టి.డబ్ల్యూ.జే.ఏ జిల్లా అధ్యక్షుడు లావుడియా మనోహర్ చౌహాన్, జర్నలిస్టులు రామన్న నాయక్, సుధాకర్, రవి, బానోత్ చందు, ధరావత్ రాజా తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలకు పరామర్శ

- బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని తహసీల్దార్‌కు ఫోన్‌లో కోరిన సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్

తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 31: వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణంలో రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో 11వ వార్డులోని వద్దే విజేందర్ ఇంటిపై పిడుగు పడటంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. పిడుగుపాటు ప్రభావంతో పలువురి ఇళ్లలో విద్యుత్ పరికరాలు దెబ్బతిని ఆస్తి నష్టం సంభవించింది. వద్దే విజేందర్ ఇంటి పైకప్పు, గోడలు దెబ్బతినడంతో పాటు రెండు ఫ్యాన్లు పాడయ్యాయి. కె. బిక్షపతి ఇంట్లో రెండు ఫ్యాన్లు, మానిటర్, నిఘా కెమెరాలు, వి. రాజు ఇంట్లో టీవీ, వి. రవి ఇంట్లో రెండు ఫ్యాన్లు, ఫ్రిజ్, జి. రాజు ఇంట్లో టీవీ, ఫ్రిజ్ దెబ్బతిన్నాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా పిడుగు పడటంతో భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. పిడుగుపాటుతో జరిగిన నష్టాన్ని నెక్కొండ తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా వివరించి, బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి బిక్షపతి, డీసీసీ సభ్యుడు నేతుల సారంగపాణి యాదవ్, మార్కెట్ డైరెక్టర్ బొమ్మెరబోయిన రమేష్ యాదవ్, సహకార సంఘం డైరెక్టర్ కదురు సాంబయ్య గౌడ్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్రబోయిన శ్రీకాంత్, వార్డు సభ్యులు దేవనబోయిన విజేందర్, భూక్య రవి, కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఈదునూరి ప్రభాకర్, పొట్లపల్లి వీరస్వామి, మూసిన సారయ్య, పోరండ్ల శ్రీనివాస్, చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నీనో ప్రభావం మీద రైతులకు అవగాహన సదస్సు

- రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలి: కె.వి.కె శాస్త్రవేత్త సుహాసిని

తొలిఅక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 31: నెల్లికుదురు మండలం నిన్న ఉదయం వావిలాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గోగుల మమత, ప్రశాంత్, అధ్యక్షతన కెత బచావో, అభియాన్, మరియు యాసంగి పంటల సాగు ప్రణాళిక పై కెవికె మల్యాల శాస్త్రవేత్త సుహాసిని, మరియు మండల వ్యవసాయ అధికారి భూక్యా మహేందర్ , నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా భూసారా పరిరక్షణ అవశ్యకత మరియు సేంద్రీయ ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత యాసంగి లో సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల రైతాంగం తీసుకోవాల్సిన జాగ్రత్తలో భాగంగా వరి పంట ను తగ్గించి ఆరు తడి పంటలు సాగు చేపట్టాలని సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఇఓ మణికంఠ,ధరణీశ్, గ్రామ రైతు సోదరులు పాల్గొన్నారు.

వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మ్యాచర్‌తో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలి

- రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి ఢిల్లీ మాధవరెడ్డి

తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 31: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మ్యాచర్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, చౌటుప్పల్ మండలానికి చెందిన ఢిల్లీ మాధవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలో వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా, తడిసిన ధాన్యాన్ని సైతం వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. రైతులు ధాన్యాన్ని రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి లేకుండా తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని, ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని ఢిల్లీ మాధవరెడ్డి విజ్ఞప్తి చేశారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- విద్యార్థులకు వ్యాసరచన పోటీలు.. బహుమతుల ప్రదానం

తొలిఅక్షరం /నర్సింహులపేట అక్టోబర్ 31: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సింహులపేట మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యతతో పాటు పోలీసుల సేవలు, త్యాగాల పట్ల అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన పోలీసు శాఖకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే

బియ్యం విక్రయించాలి

- ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలి.. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31:జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం 26 కిలోల బ్యాగ్ ప్యాక్ బియ్యానికి కిలో ధర బీపీటీ, కేఎన్ఎం రకాలు రూ. 66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకాలు రూ. 74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాలు రూ. 79గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరల వివరాలతో కూడిన ప్రభుత్వ ధరల పట్టికను రైస్ మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు, విక్రయ కేంద్రాల్లో వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల అధికారి పట్టణంలోని బియ్యం విక్రయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని వ్యాపారులకు సూచిస్తూ, నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధర కంటే అధికంగా డబ్బులు వసూలు చేసినట్లయితే వెంటనే జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం, ఖమ్మం దృష్టికి తీసుకురావాలని చందన్ కుమార్ కోరారు.

అయ్యప్పస్వామి సేవే నా పూర్వజన్మ సుకృతం: శ్రీకాంత్ గంట స్వామి

- మూడోసారి అయ్యప్ప మాల ధరించిన శ్రీకాంత్ గంట
- నిజాంపేట సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో వేడుకగా దీక్షా స్వీకారం
- గురుస్వామి దీపక్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మాలధారణ



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ అక్టోబర్ 31: నిజాంపేట: శ్రీకాంత్ గంట స్వామి శనివారం మూడోసారి ఘనంగా అయ్యప్ప మాలధారణ చేశారు. నిజాంపేటలోని శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో గురుస్వామి దీపక్ ఆధ్వర్యంలో, భక్తుల శరణుఘోష మధ్య ఆయన దీక్షను స్వీకరించారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ గంట స్వామి మాట్లాడుతూ... "అయ్యప్ప స్వామివారి మాలధారణ చేయడం నా పూర్వజన్మ సుకృతం. మూడోసారి దీక్ష తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. గురుస్వామి పర్యవేక్షణలో పరిపూర్ణ నిష్ఠ, నియమాలతో ఈ దీక్షను పూర్తిచేసి శబరిమల స్వామివారిని దర్శించుకుంటాను" అని తెలిపారు.మూడోసారి దీక్ష చేపట్టిన శ్రీకాంత్ స్వామికి పలువురు భక్తులు, మిత్రులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- ఎస్పీ డాక్టర్ శబరీష్.. రక్తదాన శిబిరంలో 165 యూనిట్ల రక్తం సేకరణ

తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 31:పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని మొత్తం 165 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత, సమాజ శాంతి కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.శిబిరం నిర్వహణలో సహకరించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులను ఎస్పీ అభినందించారు. రక్తదానం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎస్డీపీఓ తిరుపతిరావు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వన ప్రేమికుడు సమ్మయ్య

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అంతర్జాతీయ హరిత మిత్ర అవార్డు గ్రహీత నల్లగొండ సమ్మయ్య

తొలి అక్షరం/నెక్కొండ, అక్టోబర్ 31:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ 42వ వర్ధంతిని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ హరిత మిత్ర అవార్డు గ్రహీత, వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య ఆధ్వర్యంలో గ్రామ తొలి మహిళా సర్పంచ్ పరకాల సుగుణమ్మసారయ్య కుటుంబ సభ్యుల సమక్షంలో వారి ఇంటి ఆవరణలో పలు పూలు, పండ్ల మొక్కలను నాటించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని అన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే ప్రకృతిని కాపాడుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. నల్లగొండ సమ్మయ్యను స్ఫూర్తిగా తీసుకొని గ్రామస్తులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సమ్మయ్య స్వయంకృషితో గుండ్రపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా మొక్కలు నాటి సంరక్షించడంతో అవి మహావృక్షాలుగా ఎదిగి గ్రామానికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఆయన చేస్తున్న పర్యావరణ సేవలు దేశానికే ఆదర్శనీయమని కొనియాడారు.అనంతరం వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మొక్కలు నాటి ఆమెకు నివాళులర్పించడం సంతోషంగా ఉందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించి పెంచే బాధ్యత తనదేనని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పరకాల భద్రమ్మ, పరకాల రాము, పరకాల సులోచన, పరకాల జీవన, పరకాల మనోజ్ఞ, పరకాల కావ్య, పరకాల రుస్మిత,ప్రియా, పరకాల జాహ్నవి పాల్గొన్నారు.

శ్రామిక వర్గానికి రక్షణ కవచం ఏఐటీయూసీ

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలే మార్గం

50 ఏళ్లు నిండిన సివిల్ సప్లై హమాలీలకు పింఛను కల్పించాలి: పాపగళ్ల శంకరయ్య

తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 31:శ్రామిక వర్గానికి రక్షణ కవచంగా ఏఐటీయూసీ నిలుస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. సివిల్ సప్లై అమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపగళ్ల శంకరయ్య జెండాను ఆవిష్కరించారు.పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఆవిర్భవించిన ఏఐటీయూసీ, తన సుదీర్ఘ ప్రస్థానంలో కార్మిక వర్గానికి ఎన్నో పోరాట పాఠాలు నేర్పిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అగ్రగామిగా పాల్గొని, అనేక త్యాగాలు చేసిందని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడి, శ్రామిక వర్గానికి అండగా నిలిచిన ఘనత ఏఐటీయూసీకి దక్కుతుందన్నారు.కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కార్మిక నియమావళులుగా మార్చడం కార్మికుల హక్కులకు విఘాతం కలిగిస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను కాపాడుకోవాలంటే ఐక్యంగా ఉండి పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.సివిల్ సప్లై అమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపగళ్ల శంకరయ్య మాట్లాడుతూ.. 50 సంవత్సరాలు నిండిన సివిల్ సప్లై హమాలీ కార్మికులకు పింఛను సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారిని సంఘటితం చేసి, హక్కుల సాధనకు పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు టంగుటూరి రాములు, ఉడత రామలింగం, రండి నరసింహ, బత్తుల సుధాకర్, సివిల్ సప్లై హమాలీ కార్మికులు బి. యాదయ్య, కే. సైదులు గౌడ్, కే. ఈశ్వర్, బి. లింగస్వామి, సంజీవ, కే. మల్లయ్య, ఏ. బాబు, ధనమ్మ, కే. నరసింహ, కే. స్వామి, కే. శ్రీకాంత్, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

బాలల హక్కులు, భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

- పోక్సో చట్టం2012పై విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు

తొలి అక్షరం/వలిగొండ, అక్టోబర్ 31:యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వలిగొండలోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాల ఆవరణలో మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో 'సురక్ష బచ్‌పన్ అభియాన్‌బాలల హక్కులు మరియు పోక్సో చట్టం2012' అంశంపై శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామన్నపేట మండల న్యాయ సేవల కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.సదస్సులో బాలలపై లైంగిక వేధింపుల నిరోధక పోక్సో చట్టం2012, మంచి స్పర్శచెడు స్పర్శ, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అంతర్జాలం, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. ఆపద సమయంలో సహాయం కోసం బాలల సహాయవాణి 1098, పోలీసు సహాయ సంఖ్య 112, ఉచిత న్యాయ సహాయం కోసం 15100 నంబర్లను సంప్రదించాలని సూచించారు.సామాజిక మాధ్యమాలను విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి మాత్రమే ఉపయోగించుకోవాలని, అనవసర ఆకర్షణలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపాలని న్యాయమూర్తి సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు మంచి పౌరులుగా ఎదిగి సమాజ, దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ప్యానెల్ న్యాయవాదులు కునూరు శ్రీనివాస్, సోమ సతీష్ రెడ్డి, వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రం సభ్యుడు కనుగంటి శ్రీశైలం, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్త కురిమేటి యాదయ్య, పాఠశాల డైరెక్టర్ బాలరాజు, ప్రిన్సిపాల్ థామస్ అబ్రహం, వలిగొండ ఎస్సై ఎ. శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవంబర్ 6 తర్వాత కూడా పట్టభద్రుల

ఓటరు నమోదుకు అవకాశం

- అర్హులైన పట్టభద్రులందరూ నమోదు చేసుకోవాలి: అదనపు సీఈఓ వాసం వెంకటేశ్వర్ రెడ్డి

తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31:వరంగల్‌నల్గొండఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 తర్వాత కూడా అవకాశం ఉంటుందని అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌తో కలిసి ఓటరు నమోదు ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన వేగవంతం చేయాలని సూచించారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. దరఖాస్తుదారుల విద్యార్హత, నివాస స్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో జిల్లాలో 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుతం 73,898 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈసారి 1.5 లక్షలకు పైగా పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యమని వెల్లడించారు.నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించి, డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, డిసెంబర్ 30న తుది జాబితా విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మహిళా భజన బృందానికి చీరల పంపిణీ

● 31 మంది మహిళలకు సొంత ఖర్చులతో చీరల అందజేత

తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 31: పోచంపల్లిలో జరిగే భజన మండలి కార్యక్రమానికి వెళ్తున్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ మహిళా భజన బృందంలోని 31 మంది సభ్యులకు దేవాలయ అధ్యక్షులు ఎరుకుల సంధ్య రాందాస్ గౌడ్ తన సొంత ఖర్చులతో చీరలు పంపిణీ చేశారు. మహిళా భజన బృందం సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లీబిడ్డ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

● బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: టీఆర్‌పీ ఇన్‌చార్జి సంతోష్

తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 31: షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లీబిడ్డ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీఆర్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మె సంతోష్ డిమాండ్ చేశారు. వైద్యుల నిర్లక్ష్యంపై విచారణ జరిపించాలని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

షాద్‌నగర్ ఆసుపత్రిలో తల్లీబిడ్డ మృతి.. సమగ్ర విచారణకు సీపీఎం డిమాండ్

● వైద్యుల నిర్లక్ష్యం తేలితే కఠిన చర్యలు తీసుకోవాలి: శ్రీనునాయక్

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 31: ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లీబిడ్డ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం షాద్‌నగర్ పట్టణ కార్యదర్శి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. కొందుర్గు మండలం చెరుకుపల్లికి చెందిన రాధను ప్రసవం కోసం భర్త రమేష్ షాద్‌నగర్ ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిపారు. సాయంత్రం వరకు ప్రసవం జరుగుతుందని చెప్పిన వైద్య సిబ్బంది, అనంతరం మరో ఆసుపత్రికి వెళ్లాలని సూచించారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారన్నారు. వైద్యుల నిర్లక్ష్యంపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, మృతదేహం తరలింపు, చికిత్స వివరాలను కుటుంబానికి తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు మెరుగైన వైద్యం, అత్యవసర చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

● సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్

తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 31: నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే అఖిలభారత 36వ రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కక్కిరేణి గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటోందని, రైతుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం జరిగే జాతీయ మహాసభలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు వేముల సైదులు, శాఖ కార్యదర్శి కన్నబోయిన యాదయ్య, రైతులు పిట్ట శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, శ్రీను, భిక్షం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓ వెంకటరమణకు ఘన వీడ్కోలు

● మహిళా శిశు సంక్షేమానికి ఆమె సేవలు అభినందనీయం: జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాసరావు

తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 31: రామన్నపేట సీడీపీఓగా మహిళా శిశు సంక్షేమానికి విశేష సేవలందించిన ఉత్తంగి వెంకటరమణ సేవలు అభినందనీయమని జిల్లా సంక్షేమ అధికారి చిలుకూరు శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆమె పదవీ విరమణ సందర్భంగా జేపీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వీడ్కోలు సభలో మాట్లాడారు. అనంతరం అధికారులు, అంగన్వాడీ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

బాచుప్పల, సూరారం, తుర్కపల్లి గ్రామాల్లో ఎల్ నినో ప్రభావంపై ప్రత్యేక గ్రామసభలు

తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 31; రామన్నపేట మండలంలోని బాచుప్పల, సూరారం, తుర్కపల్లి గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. రానున్న రోజుల్లో ఎల్ నినో ప్రభావం వలన కలిగే నష్టాలపై అధికారులు ప్రజలకు ప్రత్యేక గ్రామసభల ద్వారా అవగాహన కల్పించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, కరెంటును పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమం బాచుప్పల గ్రామ సర్పంచ్ మాధవి, సూరారం సర్పంచ్ బమీడిక శ్రీను, తుర్కపల్లి సర్పంచ్ చల్ల వరలక్ష్మి పిచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రామన్నపేట ఎంపీడీఓ ఏ. రాములు, ఎంపీఓ ఎండి రఫీ, ఏఓ ఎజాజ్ అలీఖాన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఆశిష్ రాఘవ్, ఏపీఓ వెంకన్న, హెచ్ ఈ ఓ గోపాల్, వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళ ఇందిరా గాంధీకి ఘన నివాళి

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: దేశ సమగ్రత,సార్వభౌమాధికారం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అర్పించిన ఉక్కు మహిళ,భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా 31డివిజన్ మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు,సత్తు రమేష్,వేల్పుల మోహన్ రావు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ఆమె ప్రవేశపెట్టిన ఇరవై సూత్రాల పథకం,బ్యాంకుల జాతీయకరణ వంటి సాహసోపేత నిర్ణయాలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన గొప్ప నాయకురాలు ఇందిరమ్మ అని మామిండ్ల రాజు ఈ సందర్భంగా కొనియాడారు. బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె చేసిన విశేష కృషిని గుర్తుచేసుకున్నారు. ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఆమె చెరగని ముద్ర వేశారని,ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్ రావు,డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,మాజీ అధ్యక్షులు అంకేశ్వర్ సురేందర్,కనుకుంట్ల కృష్ణ,వెల్దండి రమేష్,డిసిసికార్యవర్గ సభ్యులు మామిండ్ల సురేష్,సీనియర్ నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మూడు నెలలైనా ప్రారంభానికి నోచుకోని బీసీ హాస్టల్

● వెంటనే ప్రారంభించాలి.. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం: ఎస్‌ఎఫ్‌ఐ

తొలి అక్షరం/చౌటుప్పల్, అక్టోబర్ 31: చౌటుప్పల్ మండల కేంద్రంలో మంజూరైన బీసీ విద్యార్థుల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హాస్టల్ మంజూరై మూడు నెలలు గడిచినా ప్రారంభించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల నుంచి చదువుల కోసం వచ్చే పేద విద్యార్థులు రోజూ రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టల్ ప్రారంభమైతే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి వసతి, సిబ్బంది, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బండారి విక్రమ్, వరుణ్‌తేజ్, సుర్వి అరవింద్, శివ, వంశీ, నితిన్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రెండు కంప్యూటర్లు అందజేత

తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 31: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్ యూత్ అసెంబ్లీ (HYA XVI)లోని క్వాలిటీ సంస్థ ప్రతినిధులు రెండు కంప్యూటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గర్ధాస్ విక్రమ్, ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, పంచాయతీ కార్యదర్శి వి. నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు, మాజీ ఉపసర్పంచ్ గర్ధాస్ వెంకటేష్, మేకల నరేందర్, గర్ధాస్ శ్రీకాంత్, గర్ధాస్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయం.. ఆమె ఆశయాలే కాంగ్రెస్‌కు స్ఫూర్తి: యాదవ రెడ్డి

● ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా నెల్లికుదురు మండల కాంగ్రెస్ అధ్యక్షుడి నివాళి ● విలేకరుల సమావేశంలో ఇందిరమ్మ పాలన, దేశాభివృద్ధికి ఆమె చేసిన కృషిని గుర్తుచేసిన యాదవ రెడ్డి

తొలి అక్షరం/నెల్లికుదురు అక్టోబర్ 31: నెల్లికుదురు: భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నెల్లికుదురు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాదవ రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఇందిరాగాంధీ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్న గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని కొనియాడారు. ఆమె చూపిన మార్గం, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని యాదవ రెడ్డి అన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. యువతకు అవగాహన

- రామన్నపేటలో ఘనంగా 'నషా ముక్త్ భారత్' మినీ మారథాన్

తొలి అక్షరం/రామన్నపేట, అక్టోబర్ 31: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు సి. జగదీశ్ పిలుపునిచ్చారు. 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా శనివారం రామన్నపేటలో మినీ మారథాన్ నిర్వహించారు. కళాశాల నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు సాగిన మారథాన్‌ను జగదీశ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యంతో పాటు కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాకుండా సమాజంలో అవగాహన కల్పించాలని సూచించారు. మారథాన్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు అశోక్ కుమార్, అశోక్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ కావాలి

వెల్‌జర్లలో నూతన రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం

గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్

తొలి అక్షరం /షాద్, నగర్, అక్టోబర్ 31: వెల్ జర్ల గ్రామంలోని అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో వెల్ జర్ల గ్రామంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్ ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆర్. బాబు నాయక్ మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందన్నారు. రేషన్ కార్డులు కేవలం నిత్యావసర సరుకులు పొందేందుకు మాత్రమే

కాకుండా, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు కీలకమైన గుర్తింపు పత్రాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు.నూతన రేషన్ కార్డుల మంజూరుతో ఇన్నాళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయంతో తమకు రేషన్ కార్డులు అందడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడంలో రేషన్ కార్డులు కీలక పాత్ర పోషిస్తాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.గ్రామ అభివృద్ధితో పాటు అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ ఆర్. బాబు నాయక్ ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొడల వెంకటేష్,వార్డు సభ్యులు వెంకటయ్య , తుప్పరి రమేష్, కాంగ్రెస్ నేతలు జాంగారి రవి, కాంగ్రెస్ మండల కమిటీ జాయింట్ సెక్రెటరీ అనిమీ అఖిల్ గౌడ్, జంగారి జంగయ్య, జిపిఓ అధికారి విష్ణు, కటికేల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

● నర్సింహులపేటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన నివాళులు

తొలిఅక్షరం/నర్సింహులపేట, అక్టోబరు 31:మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నర్సింహులపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం ఇందిరాగాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, గ్రామ సర్పంచ్ పెద్దమాముల యాకయ్య, ఉప సర్పంచ్ కాస యాకయ్య మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర సతీష్‌గౌడ్, నాయకులు అలువాల శ్రీను , నిమ్మలశ్రీను , రేఖ అనిల్, ఎర్రనాగివెంకన్న , ప్రవీణ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గడ్డి వెంకటరెడ్డి, మంచినీళ్ల రఘు రెడ్డి నాగమణి, అశోక్ రెడ్డి, శేరి రామకృష్ణ వార్డ్ యాకన్నా శ్రీకాంత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి.. షాద్‌నగర్‌లో ఏఐఎస్ఎఫ్ నిరసన

- ఓటు హక్కును హరిస్తే సహించేది లేదు.. ఆకాష్ నాయక్

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 31: ప్రజల ఓటు హక్కును హరించేలా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు అంబేద్కర్ చౌరస్తా నుంచి మహనీయుల విగ్రహాల వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కళ్లకు నల్లరిబ్బన్లు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ.. దేశంలో 140 కోట్ల జనాభాలో 13 కోట్ల ఓట్లు తొలగించాలనే చర్య ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. పేదలు, దళితులు, గిరిజనులు, మైనార్టీల ఓటు హక్కులకు భంగం కలగకుండా చూడాలని కోరారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయకపోతే విద్యార్థి, యువజన ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనిల్ నాయక్, సాయి చౌహాన్, నరేష్, శ్రీహరి, రాజేష్, రాకేష్, రాఘవేందర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడు చౌదరిగూడెం అభివృద్ధికి రూ.7.05 కోట్ల నిధులు

● విద్య, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం.. ● వివరాలు వెల్లడించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్

తొలి అక్షరం/జిల్లేడు చౌదరిగూడెం , అక్టోబర్ 31: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ మేరకు జిల్లేడు చౌదరిగూడెం మండల అభివృద్ధికి రూ.7.05 కోట్ల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాకారం చంద్రశేఖర్ వెల్లడించారు. శనివారం లాలాపహాడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మారుమూల ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో లాలాపహాడ్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో 21 అదనపు గదుల నిర్మాణానికి రూ.3.36 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. చౌదరిగూడెం, రావిర్యాల, జాకారం గ్రామాల్లో పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి రూ.54 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. మండలంలోని వివిధ

గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ పనులకు రూ.2 కోట్లు, జిల్లా పరిషత్ నిధుల నుంచి మరో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. మరిన్ని నిధులు కూడా మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి, వర్షాధార పంటల సాగుపై దృష్టి సారించాలని చంద్రశేఖర్ సూచించారు. మండలంలో పంటలు ఎండిపోతున్న పరిస్థితులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కరువు మండలంగా ప్రకటించేలా కృషి చేశారని పేర్కొన్నారు. పంట నష్టం జరిగితే పరిహారం అందుతుందని రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు.2023 వరకు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు కోసం నమోదు చేసుకోవాలని చంద్రశేఖర్ కోరారు. నవంబర్ 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫారాలను సంబంధిత అధికారులకు అందించాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు మాట్లాడుతూ.. బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోందని, ఈవీఎంల ట్యాంపరింగ్‌పై ఆరోపణలు ఉన్నాయని విమర్శించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

- వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ప్రయోగశాల, టీకాల నిల్వలపై పరిశీలన

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 31: రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి శనివారం మధ్యాహ్నం షాద్‌నగర్ డివిజన్ ఫరూఖ్‌నగర్ మండలంలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, ప్రయోగశాల నిర్వహణ, మందులు, టీకాల నిల్వ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తొలుత హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులును కలిసి ఆసుపత్రిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ నర్స్ వినీతను కలిసి ఆరోజు వచ్చిన రోగుల సంఖ్య, వారిలో రక్త పరీక్షలకు పంపించిన వారి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రయోగశాలను సందర్శించి ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ నిర్వహిస్తున్న పరీక్షలు, రికార్డులు, ప్రయోగశాల రిజిస్టర్లను పరిశీలించారు. క్షయ వ్యాధి నిర్ధారణకు కఫ పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.అనంతరం ఫార్మసిస్ట్ పర్వతాలుతో కలిసి గర్భిణులు, చిన్నారులకు అందించే టీకాల నిల్వ విధానాన్ని పరిశీలించారు. ఐఎల్ఆర్ పరికరంలో టీకాలను భద్రపరిచే విధానం, కోల్డ్ చైన్ నిర్వహణ, ఉష్ణోగ్రతల నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు, విధుల నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి, ఈ వారానికి సంబంధించిన పర్యటన వివరాలను మూమెంట్ రిజిస్టర్‌లో వెంటనే నవీకరించాలని సూచించారు. విధులకు గైర్హాజరైన కాంట్రాక్టు డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు వివరణ ఇవ్వాలని ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్టాఫ్ నర్స్ వినీతకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీలో రంగారెడ్డి జిల్లా డీపీఓ అక్రమ్, డీఎంఎంహెచ్ఓ సీసీ సురేష్, చించోడు ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ, ఫార్మసిస్ట్ పర్వతాలు, స్టాఫ్ నర్స్ వినీత, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, కంటింజెంట్ వర్కర్ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి,సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి,సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు నిర్వహించారు.డిసిసి కార్యాలయంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్,టిపిసిసి స్పోక్స్ పర్సన్ కూచన రవళి,వరంగల్ గ్రేన్ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక,టిపిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,మహిళా కమిటీ అధ్యక్షురాలు బంక సరళ లు పాల్గొన్నారు.హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని,“భారత ఉక్కు మహిళ“ శ్రీమతి ఇందిరా గాంధీ 42వ వర్ధంతి,భారతదేశ తొలి ఉప ప్రధాని,“భారత ఉక్కు మనిషి“ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు,డిసిసి కమిటీ సభ్యులు,మండల,డివిజన్ అధ్యక్షులు,అనుబంధ సంఘాల నాయకులు,నాయకురాలులు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి

ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ...దేశ సమగ్రత,ఐక్యత కోసం తమ జీవితాలను ధారపోసిన ఇద్దరు మహోన్నత నాయకులను ఒకే రోజు స్మరించుకోవడం మన బాధ్యత అని అన్నారు.దేశాన్ని అఖండ భారతంగా మార్చిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అయితే,దేశ సమైక్యత కోసం తన రక్తాన్ని సైతం ధారపోసిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ అని కొనియాడారు.‘గరీబీ హటావో‘ నినాదంతో పేదరిక నిర్మూలనకు ఇందిరమ్మ చేసిన కృషి,బ్యాంకుల జాతీయీకరణ,భూసంస్కరణలు లాంటి విప్లవాత్మక నిర్ణయాలు దేశ సామాజిక,ఆర్థిక పునాదులను పటిష్టం చేశాయని వెంకట్రామ్ రెడ్డి గుర్తు చేశారు.దేశ రక్షణ కోసం అసువులు బాసిన ఇందిరమ్మ త్యాగం యావత్ దేశానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా,స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో దేశం ముక్కలు కాకుండా తన చాణక్య నీతితో, దృఢ సంకల్పంతో వందలాది సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ గారిదని కొనియాడారు. ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో ఆయన చూపిన చొరవ,ధైర్యం సాటిలేనివన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో,ఈ మహనీయుల ఆశయాల సాధన కోసం హనుమకొండ జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు,వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు,కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘన నివాళి

- ఢిల్లీలోని శక్తిస్థల్‌లో కాంగ్రెస్ అగ్రనేతలతో కలిసి పుష్పాంజలి

తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 31:మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఢిల్లీలోని శక్తిస్థల్‌లో ఆమెకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తదితర కాంగ్రెస్ అగ్రనేతలు పాల్గొని ఇందిరా గాంధీ సేవలను స్మరించుకున్నారు.

బియ్యం ధరలకు గరిష్ఠ పరిమితి ఖరారు

- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్

తొలి అక్షరం/రంగారెడ్డి, అక్టోబర్ 31: బియ్యం ధరల పెరుగుదలను నియంత్రించేందుకు ప్రభుత్వం గరిష్ఠ విక్రయ ధరలను ఖరారు చేసింది. తెలంగాణ బీపీటీ కిలో రూ.66, సోనా రూ.74, శ్రీరామగోల్డ్ రూ.79గా నిర్ణయించినట్లు అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి తెలిపారు. వ్యాపారులందరూ నిర్ణీత ధరలకే విక్రయించాలని, అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇందిరా గాంధీకి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన నివాళి

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఢిల్లీలోని ఇందిరా ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. దేశ సమగ్రత, అభివృద్ధికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిమ్మాని శేఖర్ రావు, మహమ్మద్ ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్స్ ఫోరం మండల అధ్యక్షులకు నియామకపత్రాలు

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 31: రంగారెడ్డి జిల్లా పరిధిలోని వివిధ మండలాలకు నూతనంగా ఎన్నికైన వార్డు మెంబర్స్ ఫోరం అధ్యక్షులకు హైదరాబాద్‌లోని రాష్ట్ర కమిటీ కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ చేతుల మీదుగా జిల్లా ఇన్‌చార్జి గ్యార సురేష్, షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడిపల్లి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులను అభినందించి, వార్డు మెంబర్ల హక్కులు, సమస్యలు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జ్యోతి మహేష్‌కు నూతన అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ వార్డు సభ్యులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఫోరాన్ని మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు.

జాతీయ సమైక్యతే లక్ష్యంగా ముందుకు సాగాలి

● డిజిపి కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు), అక్టోబర్31: సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) కార్యక్రమాన్ని శనివారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ (పి అండ్ ఎల్) గజరావు భూపాల్ పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. మల్టీ జోన్-1ఐజీ చంద్రశేఖర్ రెడ్డి దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనంలో కీలక పాత్ర పోషించి దేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీ (పి అండ్ ఎల్) గజరావు భూపాల్, మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తో పాటుగా ఏఐజీ (అడ్మిన్) అన్వోన్య, పలువురు పోలీసు అధికారులు, సీఏవోలు, ఏవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు మరణంపై జిల్లా వైద్యాధికారిణి ఆకస్మిక తనిఖీ

- షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కేసు వివరాలు, వైద్యుల విధులపై విచారణ.. కలెక్టర్‌కు నివేదిక

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 31: షాద్‌నగర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణి, కడుపులోని శిశువు మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్యాధికారులు స్పందించారు. ఈ ఘటనపై రంగారెడ్డి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ అనురాగిణి రెడ్డి శనివారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి విచారణ చేపట్టారు. ప్రసవం కోసం వచ్చిన గర్భిణికి సకాలంలో వైద్యం అందలేదన్న కుటుంబ సభ్యుల ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీ ప్రాధాన్యత సంతరించుకుంది. సంబంధిత కేసు పత్రాలు, వైద్య చికిత్స వివరాలు, విధుల పట్టికలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, మత్తుమందుల వైద్యురాలు డాక్టర్ స్వాతితో పాటు ఇతర వైద్యులు, విధుల్లో ఉన్న సిబ్బందిని విడివిడిగా విచారించి వివరణలు సేకరించారు. గర్భిణి ఆసుపత్రికి వచ్చినప్పటి నుంచి అందించిన వైద్యం, ఆమె ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసిన విధానం, మెరుగైన వైద్యం కోసం తరలించడంలో జరిగిన పరిణామాలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని డీసీహెచ్‌ఎస్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమయపాలన పాటించకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని, విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తల్లీబిడ్డల ప్రాణాలకు సంబంధించిన వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావుండకూడదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ స్వాతి, ఇతర వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆందోళన

తల్లీబిడ్డ మృతి.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణలు

గతంలోనూ ఇలాంటి ఘటనలు.. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్

తొలి అక్షరం/షాద్‌నగర్, అక్టోబర్ 31: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిరుపేదలకు భరోసా కల్పించాల్సి ఉండగా, వరుసగా వెలుగుచూస్తున్న ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో గర్భిణి, ఆమె కడుపులోని శిశువు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే తమ కుటుంబంలో తీరని విషాదానికి కారణమైందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన మల్లని రమేష్‌కుమార్ భార్య రాధా ప్రసవం కోసం శుక్రవారం ఉదయం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రిలోనే ఉంచి వైద్యం అందించారని బంధువులు తెలిపారు. గర్భిణి పరిస్థితి విషమిస్తున్నప్పటికీ ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించలేదని ఆరోపించారు. చివరి దశలో హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించడంతో అప్పటికే పరిస్థితి చేయి దాటిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లీబిడ్డను కోల్పోయిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గతంలోనూ షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కేశంపేట మండలానికి చెందిన గర్భిణి విషయంలోనూ తల్లి, శిశువు మృతి చెందిన ఘటన అప్పట్లో కలకలం రేపింది. కుటుంబ నియంత్రణ చికిత్సలో వైద్య పరికరానికి సంబంధించిన ప్యాడ్‌ను కడుపులోనే మరిచిపోయారనే ఆరోపణలు సైతం వచ్చాయి. ఇటీవల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆసుపత్రి వైద్యులతో సమీక్ష నిర్వహించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయినా మరో విషాదం చోటుచేసుకోవడంతో ఆసుపత్రి పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెల్లడించాలని, నిర్లక్ష్యం రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు కార్పొరేట్ భరోసా

-రూ.42.5 లక్షల సీఎస్ఆర్ విరాళాలు

- పోలీసుల పిల్లల విద్యే ధ్యేయంగా ముందుకు వస్తున్న ప్రముఖ సంస్థలు

- డీజీపీ సీవీ ఆనంద్‌కు చెక్కులు అందజేత

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు), అక్టోబర్31: అవరాల కోసం అహర్నిశలు శ్రమించే పోలీసు సిబ్బంది కుటుంబాలకు కార్పొరేట్ దిగ్గజాలు ఘనమైన భరోసా కల్పించాయి. రక్షణ వలయంగా నిలిచే పోలీసుల పిల్లల ఉజ్వల భవిష్యత్తు, నాణ్యమైన విద్యే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభ్యున్నతికి పలు ప్రముఖ సంస్థలు ముందుకొచ్చాయి. విరాళాల రూపంలో ఏకంగా రూ.42.5 లక్షల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను ఉదారంగా అందజేశాయి. సమాజ రక్షణలో పోలీసులు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన కార్పొరేట్ వర్గాలు..వారి పిల్లల విద్యాభివృద్ధికి తమవంతు బాధ్యతగా ఆర్థిక చేయూతను అందించాయి. కోహినూర్ గ్రూప్: ఈ సంస్థకు చెందిన ఏక్యూ స్క్వేర్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున ఏకంగా రూ.25 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. సంస్థ ఎండీ మహమ్మద్ అహ్మద్ ఖాద్రీ తరఫున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహమ్మద్ అమ్జద్, ఆయన కుమారుడు మహమ్మద్ నిసార్ ఖాద్రీలు ఈ చెక్కును డీజీపీ సి.వి. ఆనంద్‌కు అందజేశారు. పుజ్జోలానా & ఆర్యన్ ప్రెసిషన్: పుజ్జోలానా మెషినరీ ఫ్యాబ్రికేషన్స్ ఎల్ఎల్‌పీ, ఆర్యన్ ప్రెసిషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల తరఫున మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్య పాయ్ రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. దివ్యశక్తి గ్రూప్: దివ్యశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక డైరెక్టర్ రవీంద్ర కుమార్ అగర్వాల్ రూ.7.5 లక్షల చెక్కును అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. **డీజీపీ సీవీ ఆనంద్ అభినందనలు:** పోలీసు సిబ్బంది సంక్షేమమే ధ్యేయంగా తాము తలపెట్టిన ఈ మహత్తర యజ్ఞంలో భాగస్వాములై, విద్యాభివృద్ధికి ఉదారంగా సహకారం అందించిన ప్రతి ఒక్క కార్పొరేట్ ప్రతినిధిని రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ హృదయపూర్వకంగా అభినందించారు. సమాజ హితం కోరే ఇలాంటి భాగస్వామ్యాలు పోలీసు కుటుంబాలకు ఎనలేని నైతిక స్థైర్యాన్ని ఇస్తాయని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

రాధ మృతిపై బీఎస్పీ ఆగ్రహం.. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి

- ప్రభుత్వ వైద్య నిర్లక్ష్యంపై విచారణ జరపాలి.. నీరటి రాజు డిమాండ్

తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 31: కొందుర్గు మండలం చెరుకుపల్లికి చెందిన గర్భిణి రాధ, ఆమె కడుపులోని శిశువు మృతి ఘటనపై బీఎస్పీ షాద్‌నగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నీరటి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ప్రభుత్వ వైద్య వ్యవస్థ విఫలమవుతోందని ఆరోపించారు. తల్లీబిడ్డల మృతికి దారితీసిన పరిస్థితులపై నిజానిజాలు వెలికితీయాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని నీరటి రాజు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలు మెరుగుపరచాలని పేర్కొన్నారు.

ద్వంద్వ ప్రమాణాలపై అనుపమ ఆవేదన

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో పెట్టిన ఒక ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మనుషుల ప్రవర్తనలోని ద్వంద్వ ప్రమాణాలపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి."ఒకప్పుడు మిమ్మల్ని తప్పు చేసినట్టు భావించేలా చేసిన పనులే, పాత్రలు తారుమారైనప్పుడు సర్వసాధారణంగా మారడం విచిత్రంగా ఉంటుంది" అంటూ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో అనుపమ పేర్కొన్నారు. సంతోషంగా ఉండటం, ఇష్టమైన వారిని మెచ్చుకోవడం వంటి చిన్న చిన్న విషయాలను కూడా తప్పుగా చిత్రీకరించారని, పదేపదే వివరణలు ఇచ్చుకునేలా చేసి, క్షమాపణలు చెప్పే స్థితికి నెట్టారని ఆమె వాపోయారు.

అయితే, అవే పనులను ఇప్పుడు ఇతరులు ఎలాంటి మొహమాటం లేకుండా బహిరంగంగా చేస్తున్నారని, దీన్నిబట్టి "సమస్య మనం ఏం చేశామన్నది కాదు, అది ఎవరు చేశారన్నదే ముఖ్యం" అని తనకు అర్థమైందని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా తన ఫాలోవర్స్‌కు కూడా అనుపమ ఒక విజ్ఞప్తి చేశారు. ఎవరి కామెంట్‌కు రిప్లై ఇచ్చానో పోల్చి చూస్తూ తనకు ట్యాగ్‌లు, మెసేజ్‌లు పెట్టవద్దని కోరారు. "నాకు సోషల్ మీడియాకు అతీతంగా సొంత బాధ్యతలు, పోరాటాలు ఉన్నాయి. ఒత్తిడి కోసం ఆన్‌లైన్‌లో నటిస్తూ బతకలేను" అని ఆమె స్పష్టం చేశారు. కొద్ది రోజుల క్రితం ఒక ప్రేమ వ్యవహారం వల్ల మానసిక ప్రశాంతత కోల్పోయానని చెప్పిన అనుపమ, ఇప్పుడు ఈ పోస్ట్ పెట్టడంతో ఇది ఎవరిని ఉద్దేశించిందనే చర్చ జరుగుతోంది.

'ఆర్‌సీ17'లో చరణ్ సరసన తెలుగమ్మాయి?.. ఎవరీ సాత్విక వీరవల్లి?

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత రాబోతున్న పాన్ ఇండియా చిత్రం 'ఆర్‌సీ17'పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ముహూర్తపు పూజా కార్యక్రమాలు నవంబర్ 1న వైభవంగా జరగనున్నాయి. సినిమా సెట్స్‌పైకి వెళ్లేందుకు సర్వం సిద్ధమవుతున్న ఈ తరుణంలో చిత్ర కథానాయిక ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ రేసులో ఎందరో ప్రముఖ నటీమణులను వెనక్కి నెట్టి, అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి సాత్విక వీరవల్లికి అవకాశం దక్కినట్లు బలమైన ప్రచారం జరుగుతోంది.'ఆర్‌సీ17' ప్రకటన వెలువడిన నాటి నుంచే హీరోయిన్ ఎవరనే దానిపై అనేక ఊహాగానాలు వినిపించాయి. గతంలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా మెప్పించి, 'ధురంధర్' సిరీస్‌తో విజయాలు అందుకున్న సారా అర్జున్‌తో పాటు రుక్మిణి వసంత్, అనీత్ పడ్డ, అనస్వర రాజన్ వంటి యువ నటీమణుల పేర్లు ప్రముఖంగా పరిశీలనలో ఉన్నట్లు వార్తలొచ్చాయి. అయితే, దర్శకుడు సుకుమార్ తనదైన శైలిలో కథలోని గ్రామీణ వాతావరణానికి, పాత్రలోని సహజత్వానికి సరిగ్గా సరిపోయే కొత్త ముఖం కోసం అన్వేషించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన దృష్టి సాత్విక వీరవల్లిపై పడినట్లు సమాచారం. ఇప్పటికే ఆమె స్క్రీన్ టెస్ట్, నటన పట్ల చిత్ర బృందం సంతృప్తిగా ఉందని, రామ్ చరణ్ సరసన ఆమె ఎంపిక దాదాపు ఖరారైందని ఫిల్మ్‌నగర్ వర్గాలు కోడై కూస్తున్నాయి.

అందరి దృష్టి సాత్విక వీరవల్లిపైనే!

ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్న సాత్విక వీరవల్లి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆమె అమెరికాలో జన్మించినప్పటికీ, ఆమె కుటుంబ మూలాలు తమిళనాడులోని చెన్నైకి చెందిన తెలుగు కుటుంబానికి సంబంధించినవి. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సాత్విక, అమెరికాలోని ప్రఖ్యాత యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్, వాండర్‌బిల్ట్ యూనివర్సిటీల నుంచి ఇంజనీరింగ్ పట్టాలు అందుకున్నారు. విద్యతో పాటు భారతీయ శాస్త్రీయ నృత్యంలోనూ ప్రావీణ్యం సంపాదించారు. నటనపై ఉన్న ఆసక్తితో చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, ఇప్పటికే దర్శకుడు పవన్ సాదినేని దర్శకత్వంలో, ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో హీరోయిన్‌గా చేస్తున్నారు. తొలి సినిమా విడుదల కాకముందే, రామ్ చరణ్-సుకుమార్ వంటి భారీ పాన్-ఇండియా కాంబినేషన్‌లో అవకాశం దక్కించుకోవడం సాత్విక కెరీర్‌కు ఒక మైలురాయిగా నిలవనుంది. సుకుమార్ మార్క్ భావోద్వేగాలు, చరణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో రానున్న ఈ చిత్రంలో తెలుగమ్మాయికి అవకాశం దక్కడంపై సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. నవంబర్ 1న జరగనున్న పూజా కార్యక్రమాల్లో కథానాయిక ఎవరనే దానిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నందున, ఈ వార్తలపై పూర్తి స్పష్టత కోసం మరికొన్ని గంటలు వేచి చూడక తప్పదు

'ఐఫా'లో 12 అవార్డులతో సత్తా చాటిన 'ధురంధర్'.. ఉత్తమ నటుడిగా రణ్‌వీర్ సింగ్

భారత చలనచిత్ర రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే 26వ అంతర్జాతీయ భారత ఫిల్మ్ అకాడమీ (ఐఫా) అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన స్పై-యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' చిత్రం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఏకంగా 12 అవార్డులను కైవసం చేసుకుని ఈ ఏడాది ఐఫాలో అతిపెద్ద విజేతగా నిలిచింది. ఈ చిత్రంలో అద్భుతమైన నటనకు గాను రణ్‌వీర్ సింగ్ ఉత్తమ నటుడిగా అవార్డును గెలుచుకున్నారు. 'ధురంధర్' చిత్రానికి ఉత్తమ చిత్రంతో పాటు దర్శకుడిగా ఆదిత్య ధర్‌కు అవార్డు లభించింది. అంతేగాక ఉత్తమ ఒరిజినల్ కథ, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ సంభాషణల విభాగాల్లోనూ ఆదిత్య ధర్ అవార్డులు గెలుచుకోవడం విశేషం. ఇదే చిత్రంలో నటనకు గాను సంజయ్ దత్ ఉత్తమ సహాయ నటుడిగా, అక్షయ్ ఖన్నా ఉత్తమ

ప్రతినాయకుడిగా ఎంపికయ్యారు. ఉత్తమ సంగీత దర్శకుడిగా శశ్వత్ సచ్‌దేవ్‌కు కూడా 'ధురంధర్' చిత్రానికే అవార్డు దక్కింది.మరోవైపు 'సైయారా' చిత్రంలో అద్భుతమైన నటన కనబరిచిన అనీత్ పడ్డా ఉత్తమ నటి (ప్రధాన పాత్ర) అవార్డును సొంతం చేసుకున్నారు. 'జాలీ ఎల్ఎల్‌బీ 3' చిత్రంలో నటనకు హ్యూమా ఖురేషి ఉత్తమ సహాయ నటిగా నిలిచారు. సంగీత విభాగంలో 'సైయారా' చిత్రం పలు అవార్డులు గెలుచుకుంది.

ఈ చిత్రంలోని పాటకు ఇర్షాద్ కమిల్ ఉత్తమ గేయ రచయితగా, ఫహీమ్ అబ్దుల్లా ఉత్తమ నేపథ్య గాయకుడిగా, శ్రేయా ఘోషల్ ఉత్తమ నేపథ్య గాయనిగా అవార్డులు అందుకున్నారు.

కాగా, ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'అవతార్: ఫైర్ & యాష్' ఉత్తమ అంతర్జాతీయ చిత్రంగా ఎంపికైంది.

డిజిటల్ విభాగంలోనూ ఆసక్తికర ఫలితాలు వెలువడ్డాయి. షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ దర్శకత్వం వహించిన 'ది బాడ్స్ ఆఫ్ బాలీవుడ్' ఉత్తమ వెబ్ సిరీస్‌గా, ఉత్తమ దర్శకత్వ సిరీస్‌గా రెండు అవార్డులను గెలుచుకుంది.

విమర్శకుల ప్రశంసలు పొందిన 'పాతాళ్ లోక్ సీజన్ 2' సిరీస్‌లో నటనకు గాను జైదీప్ అహ్లావత్ ఉత్తమ నటుడిగా, తిలోత్తమ షోమ్ ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు.

సుకేశ్ కేసు: నటి నోరా ఫతేహీకి ఢిల్లీ హైకోర్టు సమన్లు

బాలీవుడ్ నటి, డ్యాన్సర్ నోరా ఫతేహీకి ఢిల్లీ హైకోర్టు సమన్లు జారీ చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుకేశ్ చంద్రశేఖర్ రూ. 200 కోట్ల మనీలాండరింగ్, దోపిడీ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున సాక్షిగా హాజరుకావాలని ఆదేశించింది. నవంబర్ 2న వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి దాఖలు చేసిన మూడో అనుబంధ ఛార్జిషీట్‌లో నోరా ఫతేహీని ప్రాసిక్యూషన్ విట్నెస్ గా చేర్చారు.సీనియర్ అధికారులమంటూ బెదిరింపులకు పాల్పడిన సుకేశ్ చంద్రశేఖర్... 2020-21 మధ్య ఢిల్లీలోని రోహిణి జైలు నుంచే ఓ పెద్ద దోపిడీ రాకెట్‌ను నడిపినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. రాన్‌బాక్సీ మాజీ ప్రమోటర్ శివిందర్ మోహన్ సింగ్ భార్య అదితి సింగ్‌ను టార్గెట్ చేసి, జైలులో ఉన్న ఆమె భర్తను విడిపిస్తానని నమ్మించి ఆమె నుంచి దాదాపు రూ. 200 కోట్లు వసూలు చేశాడనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం విచారణ జరిపి... మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ కింద అభియోగాలు నమోదు చేసింది.ఈ కేసు విచారణలో భాగంగా గతంలోనే ఆర్థిక నేరాల విభాగం అధికారులు నోరా ఫతేహీని సుదీర్ఘంగా ప్రశ్నించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద ఆమె వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. తనకు సుకేశ్‌తో నేరుగా పరిచయం లేదని, అతని భార్య లీనా మరియా పాల్ ద్వారానే మాట్లాడానని నోరా అధికారులకు తెలిపారు. 2020 డిసెంబర్‌లో చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి కేవలం వృత్తిపరంగానే హాజరయ్యానని ఆమె వివరించారు.

Editor pastham Saidulu,R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad